# జంగం దేవర

వీర శైవమత వ్యాప్తికై ప్రతి ఇంటికి తిరుగుచూ శైవకథలను గానం చేసేవారు జంగం దేవరులు. వీరాభినయంతో సంగీతాన్ని మేళవించి హృదయాన్ని హత్తుకునే విధంగా జంగం కథ బహుళ ప్రాచూర్యాన్ని పొందింది. జంగందేవర అనగా శివుడు. ఈ విశ్వమంతా పరబ్రహ్మ విశ్వరూపంతో నిండివున్నదని చాటుతూ శైవక్షేత్రాల విశిష్టతలు తెలియజేస్తూ వీరు శివనామ సంకీర్తనలు చేస్తూవుంటారు. వీరు తత్వాలు అనగా వేదాంతంతో కూడిన పాటలు పాడుతారు. ఉదాహరణకు :

ఏమి సేతురా లింగా ఏమీసేతురా నీదు
మతము ఎవరికి తెలియ రాదు
గంగోదకము తెచ్చి నీకు లింగపూజలు సేతమంటే
గంగలోన కప్పచేప లెంగిలంటున్నాయి లింగా
తుమ్మిపూలు తెచ్చి నీకు తృప్తిగా పూజసేతమంటే
కొమ్మకొమ్మన కోటి తుమ్మెదలెంగిలంటున్నాయి లింగా

వీరు మతంలోని మూఢనమ్మకాలను తోలగించేందుకు ఈ విధంగా తత్వాలు పాడుతారు. జంగాల నుదుట విభూతి, నిలువులుంగీ, పాగా వల్లెవాటూ ధరించి జోడు గుమ్మెటలు చేతితోతడుతూ మువ్వలు అందెలు ధరించి సితారమీటుతూ నాట్యం చేస్తూ శైవగాథలను గానం చేస్తూవుంటారు. వీరితోపాటు ఒక వంత కూడా ఉంటాడు. వీరిలో బుడిగజంగాలు, గంటజంగాలు అనే రెండు తెగలున్నాయి. గంటవాయించుకుంటూ వచ్చే జంగాలను గంట జంగాలు అంటారు. వీరు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి, ఇంటిలో అందరినీ ఆశీర్వదించి భిక్షపెట్టగానే శంఖానాదం చేస్తూంటారు.

కొందరు జంగందేవరులు నాటు వైద్యము చేస్తూ మందులు ఇస్తూంటారు. వీరు సంక్రాంతి పండగ రోజులలో గ్రామంలో ఎక్కువగా కనబడతారు.

జంగం కథలు 12వ శతాబ్ది నుంచీ ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కళారూపము శివరాత్రి మొదలయిన శైవ సంబంధ పండగ లప్పడు ప్రదర్శించబడుతుంది.